క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాయకాపురం సెక్షన్ పరిధిలోని కంద్రిక, జర్నలిస్ట్ కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, రాజీవ్ నగర్, ఎంఐజీ కాలనీ, ఎల్ఐజీ కాలనీ, ఈడబ్ల్యూఎస్ కాలనీ, విశాలాంధ్ర కాలనీ, రాధానగర్, ప్రజాశక్తి నగర్, బర్మా కాలనీ, పాయకాపురం, భగీరథ కాలనీ, ఏపీఎస్ రెడ్డి రోడ్డు, ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్, ఎల్‌బీఎస్ నగర్, పటేల్ నగర్, లక్ష్మీనగర్, ప్రశాంతినగర్, శాంతినగర్, దేవినేని గాంధీపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీ, జీవీఆర్‌నగర్, వినాయకనగర్‌లో రూ. 48.98లక్షలతో నిర్మించతలపెట్టిన రోడ్డు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌కు అనుసంధానంగా మరో ఫ్లైఓవర్ నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. సాధ్యమైనంత త్వరలోనే రోడ్డు పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి, కరణం వెంకటరమణ, టీడీపీ నాయకులు, రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

జగన్మాతకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. విజయవాడకు చెందిన శ్రీ గాయత్రి నృత్య నికేతన్‌కు చెందిన 18 మంది చిన్నారులు పలు కీర్తనలకు ఆంధ్రనాట్యం ప్రదర్శన ఇచ్చారు. నృత్యాచారిణి ఎం. గాయత్రి పర్యవేక్షణలో గోరంట్ల నిహారిక, గహనా శ్రీవల్లిలతో పాటు పలువురు బృంద సభ్యులు ప్రదర్శించిన నాట్యం అందరినీ ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు ఆద్యంతం నాట్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

రేపు రచయిత్రి సత్యవతితో కథాసంధి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అనువాదంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న పి.సత్యవతితో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు శిఖామణి సెంటర్ సమీపంలో ఉన్న శిఖర స్కూల్ ఆవరణలో కథాసంధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శిఖర స్కూల్ డైరెక్టర్ బండ్ల మాధవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ, విజయవాడ సాహితీమిత్రులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. తెలుగు కథా రచనలో సత్యవతి ఉన్నత స్థాయి రచయిత్రిగా పేరుగాంచారని తెలిపారు. ఆమె రాసిన ఇల్లలకగానే, సూపర్ మామ్ సిండ్రోమ్, దమయంతి కూతురు లాంటి కథలు పాఠకులను ఆలోచింపజేశాయన్నారు. కథాసంధి కార్యక్రమంలో భాగంగా ఆమె తన కథా రచనల నేపథ్యాన్ని వివరించడమే కాకుండా తన కథలను చదివి వినిపిస్తారని చెప్పారు. అనంతరం ప్రేక్షకుల ప్రశ్నలకు జవాబులు చెబుతారని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

ఆటోనగర్ డీఎంకు ప్రశంసాపత్రం



ఆటోనగర్(విజయవాడతూర్పు): ఇంధనం పొదుపు చేసినందుకు గాను ఆటోనగర్ ఆర్టీసీ డిపో డీఎం కె.ప్రవీణ్‌కుమార్‌కు ఆర్ఎం ఎం. వైదానం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. 2023–24లో 4.73 శాతం వచ్చింది. 2024–25కు గాను 4.92 శాతం సాధించినట్టు డీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి ఆర్ఎం చేతుల మీదుగా ఈ ప్రశంసా పత్రాన్ని తీసుకున్నట్టు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఇంధనం పొదుపు విషయంలో డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బందితో పాటు సూపర్‌వైజర్లు, ఎస్‌డీఐ సహకారం మరువలేనిదని చెప్పారు. ఆటోనగర్ డిపోను అన్ని విధాలుగా అభివృద్ధి బాటలోకి తీసుకెళతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీటీఎం జాన్ సుధాకర్, డెప్యూటీ సీటీఎం బస్‌స్టేషన్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా సైడ్ డ్రెయిన్లు

- 58వ డివిజన్‌లో కదలని మురుగునీరు
- పట్టించుకోని వీఎంసీ అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 58వ డివిజన్‌లో సైడ్ డ్రెయిన్ల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. వరదల ప్రభావం.. డ్రెయిన్లు నిర్మించి దశాబ్దాల కాలం అవడంతో ఇక్కడ చాలా వరకూ శిథిలావస్థకు చేరుకున్నాయి. పలు చోట్ల డ్రెయిన్లు కుప్పకూలి మురుగునీటిలోనే పడిపోయి మురుగు పారుదలకు ఆటంకంగా మారాయి. అయినా కూడా తమకేమి పట్టదన్నట్లుగా కార్పొరేషన్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు స్థానిక ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.



సింగ్‌నగర్ ఆర్సీఎం చర్చి రోడ్డులో కాలువలో పడిపోయిన చప్టాలు



పీఅండ్‌టీ కాలనీలో కాలువలో విరిగిపడిన డ్రెయిన్

శిథిలావస్థలో డ్రెయిన్లు

సింగ్‌నగర్ 58, 59 డివిజన్ల పరిధిలోని డాబాకొట్లు సెంటర్, పీఅండ్‌టీ కాలనీ, గంగానమ్మగుడి, ఆర్సీఎం చర్చి రోడ్డు, సింగ్‌నగర్ కరెంట్ ఆఫీస్ ఎదురు రోడ్డు, సెయింట్ ఆన్స్ స్కూల్ రోడ్డు, వడ్డెర కాలనీ, షాదీఖానా రోడ్డు, కేఎల్‌రావు రోడ్డు, నల్ల మస్తాన్ రోడ్డు, కృష్ణాహోటల్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో డ్రెయిన్లు చాలా వరకూ శిథిలావస్థకు చేరుకున్నాయి. గతేడాది బుడమేరు వరదల తర్వాత వీటిలో కొన్ని కుప్పకూలి ఆ డ్రెయిన్లలోనే పడిపోయాయి. దీంతో మురుగు నీరు ముందుకు కదలడం కష్టంగా మారింది. వీటిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన కార్పొరేషన్ ఇంజినీరింగ్, సంబంధిత శానిటరీ విభాగ అధికారులు, మేస్త్రీలు పట్టించుకోకుండా వదిలేశారు.

రోడ్లపైనే మురుగునీరు

బుడమేరు వరదల తర్వాత సైడ్ డ్రెయిన్లలో ఎక్కడ పడితే అక్కడ మట్టి చేరిపోవడంతో మురుగునీరు ప్రవహించే పరిస్థితి లేదు. వీటికి తోడు డ్రెయిన్లు కూడా సక్రమంగా లేకపోవడంతో కొద్ది పాటి చినుకులు పడినా ఆ మురుగు నీరంతా రోడ్లపైకి చేరి ఇళ్ల ముందు ప్రవహిస్తూ స్థానిక ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీటి నుంచి వస్తున్న దుర్వాసనలు, దోమలు, పురుగులతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. సమస్యలను సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ ఉన్నతాధికారులు రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో దెబ్బతిన్న డ్రెయిన్లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కోరుతున్నారు. అలాగే ప్రాంతాల వారీగా ప్రత్యేక డ్రైవ్‌లు పెట్టి కాలువల్లో పూడికలు తీయించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు ప్రాధేయపడుతున్నారు.



సింగ్‌నగర్ కరెంట్ ఆఫీస్ వద్ద సైడ్ దుస్థితి



షెల్ హాస్పటల్ రోడ్డులో దయనీయంగా డ్రెయిన్ పరిస్థితి

నిరంతరం ఓటర్ నమోదు ప్రక్రియ

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నిరంతరంగా ఓటర్ నమోదు ప్రక్రియ జరుగుతుండాలని సెంట్రల్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో శుక్రవారం సెంట్రల్ నియోజకవర్గం రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ నిరంతరాయంగా జరగాలని, అందుకు అనుగుణంగా ప్రతి ఏఆర్వో తన పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో ఉన్న కాలేజీలలో ఒక ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిరోజు 18 సంవత్సరాలు నిండిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. నమోదైన ప్రతి ఒక్కరికీ పీవీసీ ఓటర్ కార్డ్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో కూడా ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఓటర్ నమోదు ప్రక్రియను సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఒక కుటుంబంలో ఉన్న ఓటర్లందరికీ ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు వేసే అవకాశం వచ్చేలా చూడాలని, ఏపీఆర్‌వోల పర్యవేక్షణలో ప్రతి బీఎల్ఓ వీధుల్లోని డోర్ నంబర్లలో ఉన్న ప్రజలను సర్వే చేసి వారికి ఉన్న పోలింగ్ కేంద్రాలు ఒకేలా ఉన్నాయో లేదో సర్వేచేయాలన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు నరహరిశెట్టి నరసింహారావు(కాంగ్రెస్), ఎస్.వీరభద్రరావు(సీపీఐ), ఎం.బాబురావు సీపీఐ (ఎంఎల్), తరుణ్ కాకాని (బీజేపీ), ఎస్.సాంబశివరావు(టీడీపీ), ఎ.సుందర్ పాల్ (వైఎస్సార్ సీపీ), ఏఈ ఆర్ఓలు చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, పర్యవేక్షణ ఇంజినీర్ పి. సత్యకుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, సెంట్రల్ తహసీల్దార్ ఎం. వెంకటరామయ్య, నార్త్ తహసీల్దార్ ఎం.సూర్యారావు, సెంట్రల్ డెప్యూటీ తహసీల్దార్ టి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

అగ్ని ప్రమాదాల నిరోధక చర్యలపై అవగాహన



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదాల నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేషన్ ఫైర్ సిబ్బంది పాల్గొని అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానాలను ప్లాంట్ సిబ్బందికి వివరించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్ ఎక్కడెక్కడ అమర్చాలి, స్మోక్ అలారం ఎలా పని చేస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా ఎక్సల్ ప్లాంట్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేమి ఉండాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

4న 'వెన్నుపోటు దినం' జయప్రదం చేయాలి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వ మోసపూరిత కుట్రలకు వ్యతిరేకంగా జూన్ నాలుగో తేదీన వైఎస్సార్ సీపీ తలపెట్టిన 'వెన్నుపోటు దినం'ను జయప్రదం చేయాలని ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. స్థానిక అజిత్‌సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీ జనహిత సదనంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజలకు అండగా ఉండేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ నాలుగో తేదీని వెన్నుపోటు దినంగా ప్రకటించారని తెలిపారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో కూటమి ప్రభుత్వంలో మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు పాల్గొని చంద్రబాబుకు తమ నిరసన తెలియజేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నమ్మకం, విశ్వాసం, విశ్వసనీయతకు నిదర్శనంగా నిలిచిందని.. టీడీపీ ప్రభుత్వం మోసం, వంచన, అరాచకాలకు కేరాఫ్‌గా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. 4వ తేదీన తలపెట్టిన వెన్నుపోటు దినం పురస్కరించుకుని ఉదయం 9.30 గంటలకు ధర్నాచౌక్ నుంచి గాంధీనగర్ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు కార్యకర్తలు వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కుక్కల అనిత, షాహినా సుల్తానా, కొండాయగుంట మల్లీశ్వరి, శర్వాణీమూర్తి, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, యర్రగొర్ల శ్రీరాములు, అలంపూరు విజయ్, పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అమృత్ పథకంలో నాణ్యత లేని పనులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం 33వ డివిజన్‌లో అమృత్ పథకంలో భాగంగా జరుగుతున్న వాటర్ లైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత లేని కారణంగా తాగునీటి పైప్‌లైన్‌లకు లీకులు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి పేర్కొన్నారు. అమృత్ ప్రాజెక్ట్ ఈఈ వెంకటేశ్వర్లుతో కలసి శుక్రవారం ఆయన గిరివీధి, రాణాప్రతాప్ వీధి, సుమనంవారి వీధి, కనకరాజు వీధి, పాపరాజు వీధి, కొమ్ముగారి వీధి, వందనం వారి వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ లీకేజీ పనులను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో తక్కువ లోతు తవ్వి పైప్‌లైన్‌లు వేయడంతో వాహనాల రాకపోకలతో లీకులు ఏర్పడ్డాయన్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా పనులు చేపట్టడంతో తాగునీరు లీకులు ఏర్పడి రోడ్లపై పారుతోందన్నారు. అలాగే 24 గంటలు నీటి సరఫరా కోసం ఇచ్చిన కొత్త కనెక్షన్‌లు సరిగా లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లోనూ లీకేజీలు వస్తున్నట్లు తెలిపారు. ఈ అసంపూర్తి పనులతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. వెంటనే లీకేజీ పనులను పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాల్సిందిగా ఈఈ వెంకటేశ్వర్లుకు విజ్ఞప్తి చేశారు. పర్యటనలో ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, ఏఈ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



33వ డివిజన్‌లో తాగునీటి లీకేజీలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శర్వాణీమూర్తి

బీఆర్టీఎస్ రోడ్డులో ఇష్టారాజ్యంగా పార్కింగ్





బీఆర్టీఎస్ రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే బీఆర్టీఎస్ రోడ్డులో ఎవరికి వారు ఇష్టారాజ్యంగా తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఈ రోడ్డులో కొంత మంది ఏకంగా తాడు కట్టి మరీ తమ వాహనాలను పార్క్ చేస్తున్నారు. దీంతో ఉన్న రోడ్డులో కొంత భాగంగా పార్కింగ్‌లకు సరిపోతోందని వాహనచోదకులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో తమ వాహనాలను వాహనచోదకులు రోజుల తరబడి పార్కింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వేగంగా వస్తున్న వాహనాలను క్రాస్ చేసేటప్పుడు ఇబ్బందులు కలుగుతున్నాయని వాహనచోదకులు అంటున్నారు. అధికారులు స్పందించి ఈ మార్గంలో అనధికార పార్కింగ్‌లను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మిక పక్షపాతి కుటుంబరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు లోయ వెంకట కుటుంబరావు కార్మిక పక్షపాతి అని వక్తలు పేర్కొన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఇఫ్టూ ఆధ్వర్యంలో శుక్రవారం కుటుంబరావు తృతీయ వర్ధంతి సభ జరిగింది. తొలుత కుటుంబరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ మాట్లాడుతూ కుటుంబరావు కార్మిక రంగంలో రాష్ట్ర నాయకుడిగా ఎదిగి కార్మికుల సమస్యలపై పోరాడారని తెలిపారు. సభలో టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మరిదు ప్రసాద్‌బాబు, కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు వీరబాబు, న్యాయవాది రవీంద్రనాథ్, ఇఫ్టూ నగర అధ్యక్షుడు కే రవీంద్ర, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, కార్యదర్శి జీ హరికృష్ణారెడ్డి, సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు పెద్దిరాజు, పీవోడబ్ల్యూ నగర అధ్యక్షురాలు ఆసియా, కుటుంబరావు కుమారుడు సాహిత్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇఫ్టూ నాయకులు

ప్రజానటుడు సూపర్‌స్టార్ కృష్ణ

విజయవాడ కల్చరల్: ప్రజానటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం, ఎస్ఎస్ఎస్‌కేఎస్ సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం సూపర్‌స్టార్ ఐకాన్ అవార్డుల ప్రదానం, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో కృష్ణయుగం స్వర్ణయుగమన్నారు. సాహిత్య సేవా, సామాజిక రంగాల్లో విశేషకృషి చేసిన వారి సేవలు గుర్తించి సూపర్‌స్టార్ కృష్ణ పురస్కారాలు ప్రదానం చేస్తునట్లు తెలిపారు. ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, సినీ నిర్మాత, దర్శకుడు పసుపులేటి వెంకటరమణకు సూపర్‌స్టార్ ఐకాన్ పురస్కారం ప్రదానం చేశారు. పురస్కార గ్రహీతలు పసుపులేటి వెంకటరమణ, గుప్తా మాట్లాడుతూ డేరింగ్ అండ్ డాషింగ్ హీరో కృష్ణ అని అభివర్ణించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన కే డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, చిట్టిబాబు, ప్రసూనా రామన్, కొప్పుల ఆనంద్, మారేపల్లి జోషి, రసూల్‌బాబు తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు కృష్ణ నటించిన చిత్రాల్లోని గీతాలను ఆలపించారు.



గుప్తా, పసుపులేటి వెంకటరమణకు సూపర్‌స్టార్ ఐకాన్ అవార్డ్స్ అందజేస్తున్న నిర్వాహకులు

27 నుంచి పోలేరమ్మ తిరునాళ్ల

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఊర్మిళా సుబ్బారావు నగర్ గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల జూన్ 27 నుంచి 29వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు పోలేరమ్మ దేవస్థానం కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తిరునాళ్ల వివరాలను వెల్లడించారు. పోలేరమ్మ అమ్మవారు ఊర్మిళానగర్‌లో వెలిసి 39 ఏళ్లు అయ్యిందని అప్పటి నుంచి ఏటా అమ్మవారి తిరునాళ్ల నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో పోలేరమ్మ గుడి ముందున్న రేకుల షెడ్‌ను తొలగించి సిమెంట్ కాంక్రీట్‌తో శ్లాబ్ వేసేందుకు దాతలు, ఆధ్యాత్మికవేత్తలు సహృదయంతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి గుత్తావళి విజయబాబు, కోశాధికారి దొడ్డా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మాగం ఆత్మారాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలేరమ్మ తిరునాళ్ల వేడుకల కరపత్రాన్ని సూరసాని రామిరెడ్డి ఆవిష్కరించారు.



తిరునాళ్ల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రామిరెడ్డి

ఇమ్యునైజేషన్‌పై శిక్షణ తరగతులు

పటమట(విజయవాడతూర్పు): వ్యాధి నిరోధక టీకాలు చేసిన వెంటనే తలెత్తే ప్రతికూల పరిస్థితులపై వైద్యులందరికీ అవగాహన ఉండాలని ఎన్టీఆర్ జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎం.శరత్‌బాబు తెలిపారు. నిరోధక టీకాలు వేసే వైద్య బృందాలకు ఐఎంఏ హాల్లో రెండు రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ తరగతుల్లో శుక్రవారం ఆయన మాట్లాడారు. టీకాల డేటా మూలాలు, ఉపయోగం, ఇమ్యునైజేషన్ సెషన్ నిర్వహించడం, వ్యాధి నిరోధక టీకాల ద్వారా నివారించే వ్యాధులపై నిఘా, సామర్థ్య నిర్మాణం, పర్యవేక్షణ, క్షేత్ర సందర్శన కోసం ప్రణాళిక తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మెడికల్ కాలేజీ చిన్నపిల్లల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ కుమార్ గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లుగా సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవానీ, పి.పి.యూనిట్ వైద్యాధికారి డాక్టర్ వాసంతి, యూవిన్ సమన్వయకర్త శివ శంకర్, వ్యాధి నిరోధక టీకాల శీతలీకరణ నిర్వహణకర్త కోటేశ్వరరావు శిక్షకులుగా వ్యవహరించారు. డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డీఎంఐ డాక్టర్ మోతీబాబు, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, గ్రామీణ ప్రాంత వైద్యాధికారులు, పర్యవేక్షకులు యలమందయ్య, రాజ్ వర్ధన్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు సీహెచ్ శ్రీనివాసులు

మధురానగర్: సీపీఐ నగర మాజీ కార్యదర్శి వర్గ సభ్యులు దివంగత సీహెచ్ శ్రీనివాసులు డివిజన్, నగర సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటాలు, పార్టీ బలోపేతానికి చేసిన కృషి చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీనివాసులు తృతీయ వర్ధంతి కార్యక్రమం 32వ డివిజన్‌లో సీపీఐ కార్యాలయం, లోటస్ ఆటో స్టాండ్ వద్ద శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి, స్థూపానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ డివిజన్ కార్యదర్శి డీబీకే రావు అధ్యక్షత వహించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు మూలి సాంబశివరావు, మాజీ కార్పొరేటర్ బుట్టి రాయప్ప మాట్లాడారు. శ్రీనివాసులు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌లో పనిచేసి విద్యార్థి, యువజన సమస్యలపై పోరాడారని చెప్పారు. ఈ సందర్భంగా అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. నగర కార్యవర్గ సభ్యురాలు డి. సీతారావమ్మ, ఏఐవైఎఫ్ నగర ఉపాధ్యక్షుడు సీహెచ్ శ్రీధర్, డివిజన్ సహాయ కార్యదర్శి పత్తిపాటి రాజు, ఆటో స్టాండ్ నాయకులు ఎలీషా, కొండ, సదాశివరావు, మహిళా నాయకులు రాహేలమ్మ, బుజ్జి పాల్గొన్నారు.



శ్రీనివాసులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తను ఇష్టపడిన వ్యక్తిని కుటుంబ సభ్యులు దూరం చేశారంటూ యువతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సితార సెంటర్ ప్రాంతానికి చెందిన యువతి డిగ్రీ పూర్తి చేసింది. కోవిడ్‌కు ముందు జాబ్ చేసి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటుంది. ఆ యువతికి మాట్రిమోనీలో ఉదయ్ అనే యువకుడు పరిచయడం అయ్యాడు. ఇద్దరూ ఆన్‌లైన్‌లో మాట్లాడుకుంటున్నారు. కొంత కాలంగా ఉదయ్ తనను దూరంగా పెడుతున్నాడని ముభావంగా ఉంటుంది. తన కుటుంబ సభ్యులే ఉదయ్‌ను దూరం పెడుతున్నారనే అపోహతో వారితో గొడవ పడుతోంది. ఈనేపథ్యంలో మే ఒకటో తేదీ రాత్రి బ్యాగ్ తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.